

ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి గురువారం 2,500 క్యూసెక్కులు, కుడికాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

సిరిసిల్లటౌన్: కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి, మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో రజిత పేర్కొన్నారు. గురువారం గాంధీ జయంతి సందర్భంగా ఈమేరకు ప్రతిజ్ఞ చేశారు.

గరిష్టం/కనిష్టం
31.0/18.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పొద్దంతా ఉక్కపోతగా, రాత్రి చలిగా ఉంటుంది. జిల్లాను పొగమంచు కమ్మేసే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా సమ్మయ్య

- లావణ్య జీహెచ్‌ఎంసీకి బదిలీ



సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ దుబ్బాక లావణ్య బదిలీ అయ్యారు. గురువారం వెలువడిన పలువురు కమిషనర్ల బదిలీల్లో భాగంగా ఆమెను హైదరాబాద్ జీహెచ్‌ఎంసీకి బదిలీ చేశారు. గతంలో ఆమె జీహెచ్‌ఎంసీ ఏఈవోగా పనిచేసి సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు. ప్రస్తుతం హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎస్.సమ్మయ్య సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యారు.

విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలి

- జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డి



వేములవాడఅర్బన్: ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతోపాటు ఉన్నత లక్ష్యాలు చేరేలా మార్గనిర్దేశం చేయాలని జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. వేములవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్, మార్గదర్శకత్వంపై గురువారం జిల్లాస్థాయి శిక్షణనిచ్చారు. రెండు రోజులపాటు శిక్షణ కొనసాగనుంది. సెక్టోరియల్ అధికారి శైలజ, మండల విద్యాధికారి బన్నాజీ, పాఠశాల హెచ్‌ఎం రాజారత్నం పాల్గొన్నారు.

ప్రధానితో చర్చలో పాల్గొన్న విద్యార్థికి సన్మానం



కోనరావుపేట(వేములవాడ): ప్రధాని నరేంద్రమోదీ సమక్షంలో నిర్వహించిన పరీక్ష పే చర్చలో పాల్గొన్న మండలంలోని సుద్దాలకు చెందిన విద్యార్థిని సాయితేజను గ్రామస్తులు గురువారం సన్మానించారు. స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన అలువాల సాయితేజ ఇటీవల ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీతో జరిగిన పరీక్ష పే చర్చలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ, నాయకులు అంబోజి లక్ష్మీనారాయణ, జితేందర్, వెంకటేశం, కిషన్, వామన్, తిరుపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ వస్త్ర ఉత్పత్తులపై మెరుగైన కూలి ఇవ్వాలి



సిరిసిల్లటౌన్: ప్రభుత్వ ఉత్పత్తులు నేసే నేత కార్మికులకు రోజుకు రూ.వేయి కూలి నిర్ణయించాలని పవర్‌లూమ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ కోరారు. వస్త్ర పరిశ్రమలోని కార్మికుల సమస్యలపై గురువారం చేనేత, జౌళిశాఖ ఆఫీసులో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వార్పిన్, వైపని, అనుబంధ రంగాల కార్మికులకు పెద్దపన్న 10 పిక్కులకు 35 పైసలు, చిన్నపన్న 10 పిక్కులకు 30 పైసలు ఇవ్వాలని, వార్పిన్ కార్మికులకు వేయి పోగులకు రూ.110, టెక్స్‌టైల్ పార్కులో పనిచేసే కార్మికులకు 10 పిక్కులకు 50పైసలు ఇవ్వాలని కోరారు. 2023 ఏడాదికి కార్మికులకు రావాల్సిన యారన్ సబ్సిడీ అందించాలని, ఇప్పుడు ఉత్పత్తి చేస్తున్న వాటికి యారన్ సబ్సిడీ వర్తింపజేయాలని కోరారు. కోడం రమణ, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, నక్క దేవదాసు, గుండు రమేశ్, కూచన శంకర్, కుడిక్యాల కనకయ్య పాల్గొన్నారు.

చిన్న ఆసాములకే యారన్

- టెక్స్‌టైల్ శాఖ అధికారి సాగర్

సిరిసిల్లటౌన్: చేనేత, పవర్‌లూం కార్మికులు, అనుబంధ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం 'చేనేత అభయహస్తం' పథకాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా టెక్స్‌టైల్ అధికారి సాగర్ తెలిపారు. గురువారం వివరాలు వెల్లడించారు. యారన్ డిపో ద్వారా చిన్న ఆసాములకు మాత్రమే యారన్ పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎస్‌ఎస్‌ఐ కింద నమోదైన వారు వారి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకున్న ప్రతిని సెస్ కార్యాలయంలో అందజేస్తే 25 హెచ్‌పీ వరకు విద్యుత్ సబ్సిడీ వర్తిస్తుందని వివరించారు. టెక్స్‌టైల్ పార్క్‌లోని ర్యాపియర్ యూనిట్లకు సమగ్ర శిక్ష, వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్లకు అవసరమగు 46 లక్షల మీటర్ల క్లాత్ ఆర్డర్ టీజీఎస్‌సీవో ద్వారా కేటాయించినట్లు తెలిపారు.

ఆమె జాడేది?



- ఎమ్మెల్సీ పోటీకి ఆసక్తి చూపని మహిళా నాయకులు
- నాలుగు పాత జిల్లాల్లో 1.23 లక్షల ఓట్లు వారివే
- ఉపాధ్యాయుల ఓటర్లలో సగానికిపైగా మహిళలే
- టీచర్, గ్రాడ్యుయేట్లలోనూ ఉమ్మడి కరీంనగర్ టాప్
- నామినేషన్లలోనైనా తెరపైకి వచ్చేనా?

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

కరీంనగర్–మెదక్–నిజామాబాద్– ఆదిలాబాద్ జిల్లాల శాసనమండలి ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. బుధవారం మధ్యాహ్నం నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది. గత మూడు నాలుగునెలలుగా పలువురు అభ్యర్థులు పట్టభద్రులు, ఉపాధ్యాయబరిలో పోటీ చేస్తామంటూ హడావుడి చేస్తున్నారు. భారీ బహిరంగ సభలు, ప్రకటనలతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరంతా పురుషులే కావడం, ఇంతవరకూ ఒక్క మహిళా నేతైనా బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపకపోవడం గమనార్హం. వాస్తవానికి పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటర్ల జాబితాలో మహిళలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నారు. దాదాపు 3.4 లక్షల పట్టభద్రుల ఓటర్ల జాబితాలో 50 శాతం కంటే అధికంగా అంటే 1.2 లక్షల మంది మహిళలే. అదే విధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో మహిళల సంఖ్య అధికంగా ఉంది. మొత్తం ఓటర్లు 16 వేలకుపైగా ఉన్న మొత్తం ఓటర్లలో దాదాపు 10 వేలమంది మహిళా ఉపాధ్యాయ, అధ్యాపకులే కావడం విశేషం. అయినప్పటికీ.. రాజకీయంగా మహిళలు ఎవరూ ఇంతవరకు ముందుకు రాలేదు. వచ్చే నెల 3వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై.. 10వ తేదీన ముగియనుంది. కనీసం అప్పటికైనా మహిళా అభ్యర్థులు బరిలో ఉంటారా? అన్నది ఆసక్తికరంగా మారింది. బీజేపీ అందరి కంటే ముందే అభ్యర్థులను ప్రకటించింది. ఇక బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల నుంచి టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులంతా పురుషులే. కనీసం స్వతంత్రుల్లోనూ మహిళలు ఎవరూ లేకపోవడం గమనార్హం. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీచేసిన అభ్యర్థులు ముందుజాగ్రత్తగా డమ్మీలుగా భార్యలతో నామినేషన్ వేయించారు. ఈసారి ఎన్నికల్లో మహిళ అభ్యర్థులు కనీసం డమ్మీలుగానైనా వస్తారా? లేదా అన్నది వేచి చూడాలి.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా టాప్

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్ల విషయంలో ఉమ్మడి జిల్లా అగ్రభాగాన ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1.55 లక్షల ఓట్లు ఉండగా.. అందులో 61 వేల పైచిలుకు మహిళా ఓట్లు పాత జిల్లాకు చెందినవే. అందులోనూ కరీంనగర్ (27,992) ఓటర్లతో మొదటిస్థానంలో ఉండగా.. ఆ తర్వాతి స్థానాల్లో జగిత్యాల (13,206), పెద్దపల్లి (11,638), రాజన్నసిరిసిల్ల (8,323) జిల్లాలు నిలిచాయి. అదే విధంగా ఉపాధ్యాయ ఓటర్లలో మొత్తం 16 వేల ఓటర్లలో 10 వేల వరకు మహిళలే ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 4,951 ఓట్లు ఉండగా అందులో 2,708 మహిళలే ఉన్నారు. వాటిలోనూ కరీంనగర్ (1,508 ఓట్లు) తొలిస్థానంలో నిలువగా, జగిత్యాల (509), పెద్దపల్లి (450), సిరిసిల్ల (241) జిల్లాలు ఆ తర్వాత స్థానాలను దక్కించుకున్నాయి.

పట్టభద్రుల ఓటర్లు ఇలా..

జిల్లా	పురుషులు	స్త్రీలు	థర్డ్‌జెండర్	మొత్తం
ఆసిఫాబాద్	4106	1749	0	5855
మంచిర్యాల	18882	11606	0	30488
ఆదిలాబాద్	10104	4482	0	14586
నిర్మల్	11271	5538	0	16809
నిజామాబాద్	19368	11225	0	30593
కామారెడ్డి	11228	4587	1	15816
జగిత్యాల	21075	13206	0	34281
పెద్దపల్లి	18430	11638	1	30069
కరీంనగర్	41665	27992	0	69657
రాజన్న సిరిసిల్ల	13290	8323	1	21614
సంగారెడ్డి	14437	6766	0	21203
మెదక్	8533	3420	0	11953
సిద్దిపేట	20922	10624	0	31546
హనుమకొండ	3055	1368	0	4423
జయశంకర్‌భూపాలపల్లి	1694	726	0	2420
మొత్తం	2,18,060	1,23,250	3	3,41,313

ఉపాధ్యాయ ఓటర్ల సంఖ్య

జిల్లా	పురుషులు	స్త్రీలు	మొత్తం
ఆసిఫాబాద్	314	143	457
మంచిర్యాల	940	610	1550
ఆదిలాబాద్	1073	488	1561
నిర్మల్	1263	681	1944
నిజామాబాద్	2100	1429	3529
కామారెడ్డి	1341	720	2061
జగిత్యాల	1197	509	1706
పెద్దపల్లి	609	450	1059
కరీంనగర్	2512	1508	4020
రాజన్న సిరిసిల్ల	633	241	874
సంగారెడ్డి	1485	1103	2588
మెదక్	766	515	1281
సిద్దిపేట	1948	1104	3052
హనుమకొండ	120	38	158
జయశంకర్ భూపాలపల్లి	63	18	81
మొత్తం	1,6,364	9557	2,5,921



- 2 నుంచి మార్చి 17 వరకు ముహూర్తాలు

మోగనున్న పెళ్లి బాజాలు

విద్యానగర్(కరీంనగర్)/జ్యోతినగర్(రామగుండం): మాఘమాసం గురువారం ప్రారంభమైంది. ఇక, పెళ్లి బాజాలు మోగనున్నాయి. గృహప్రవేశాలకు అన్నీ మంచి రోజులే. ఫిబ్రవరి 2 నుంచి మార్చి 17 వరకు ముహూర్తాలుండగా.. వాటిలో ఫిబ్రవరి 16, మార్చి 16న ఎక్కువ పెళ్లిళ్లు జరుగుతాయని కరీంనగర్‌కు చెందిన మయూరగిరి పీఠాధిపతి, జ్యోతిష్య, వాస్తు పండితుడు నమిలికొండ రమణాచార్యులు, మల్కాపూర్‌కు చెందిన పురోహితుడు రుద్రభట్ల సత్యనారాయణ తెలిపారు. ఫిబ్రవరిలో 2, 3, 7, 13, 14, 15, 16, 21, 23, 25, మార్చిలో 2, 6, 7, 12, 14, 15, 16, 17 తేదీల్లో పెళ్లి ముహూర్తాలున్నాయని పేర్కొన్నారు. వివాహాలకు సిద్ధమవుతున్నవారు ఫంక్షన్‌హాళ్లు, డెకరేషన్, కేటరింగ్ బుకింగ్ తదితర పనుల్లో బిజీ అయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులు వసతులను బట్టి రూ.40 వేల నుంచి రూ.3 లక్షల వరకు తీసుకుంటున్నారు. పెళ్లిళ్ల సీజన్ మొదలవడంతో వస్త్ర, బంగారం దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా కనిపిస్తున్నాయి.

గాంధీజీ ఆలోచనలను ముందుకు తీసుకెళ్దాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


పూలమాల వేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: మహాత్మాగాంధీ ఆలోచన విధానం ముందుకు తీసుకెళ్దామని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా వేములవాడ మండలం చీర్లవంచలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న 3వేలకు పైగా దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు పిల్లి కనకయ్య, ఎర్రం రాజు, చింతపల్లి శ్రీనివాసరావు, కత్తి కనకయ్య, ఎర్రం ఆగయ్య, సత్తయ్య, గాలిపెల్లి స్వామి, ఇటుకల రాజు తదితరులు ఉన్నారు.

మహాత్మా.. కాంగ్రెసోళ్ల కళ్లు తెరిపించు

- బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీశ్


గాంధీ విగ్రహానికి బీఆర్‌ఎస్వీ నేతల వినతి

సిరిసిల్లటౌన్: బాపూజీ వారసులుగా చెప్పుకుంటూ..అధికారం కోసం ప్రజలను వంచిస్తున్న కాంగ్రెసోళ్ల కళ్లు తెరిపించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ కోరారు. ఈమేరకు గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా సిరిసిల్లలో గాంధీ విగ్రహానికి నివాళి అర్పించి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ తెలంగాణలో డిక్లరేషన్ల పేరిట అలవిగాని 6 గ్యారెంటీలు, 420 హామీలు ప్రకటించి అధికారంలోకి వచ్చారన్నారు. ఏడాది గడుస్తున్నా అమలు చేయడం లేదని, ఇప్పటికైనా సీఎంకు జ్ఞానోదయం కల్పించాలని కోరారు.

అల్పాహారానికి నిధులొచ్చాయ్..


పాఠాలు వింటున్న పదోతరగతి విద్యార్థులు

- 'పది' విద్యార్థులకు తీరిన ఆకలిబాధ
- సాయంత్రం స్నాక్స్ కోసం డబ్బులు
- ఒకటో తేదీ నుంచి అమలు
- విద్యాధికారులకు ఆదేశాలు

స్నాక్స్ ఇలా..

- ఉడికించిన పెసర్లు
- పల్లిబెల్లం
- మిల్లెట్ బిస్కెట్స్
- ఉడికించిన బబ్బెర్లు
- ఉల్లిగడ్డ పకోడి
- ఉడికించిన శెనగలు

సిరిసిల్ల ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యాలయాల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల సమయంలో అల్పాహారం అందించేందుకు మార్గం సుగమమైంది. సాయంత్రం విద్యార్థులకు వారంలో ఆరు రోజులపాటు వివిధ రకాలుగా అల్పాహారం అందించేందుకు విధివిధానాలు ఖరారయ్యాయి. వీటిని అందించేందుకు అవసరమైన నిధులు జిల్లా విద్యాధికారి పర్యవేక్షణలో సద్వినియోగమయ్యేలా చర్యలు తీసుకునేందుకు ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ఇన్నాళ్లు పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల సమయంలో అల్పాహారం అందించేందుకు సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు పడిన కష్టానికి ముగింపు పడింది. పదోతరగతి విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

1వ తేదీ నుంచి అమలు

జిల్లాలోని జిల్లాపరిషత్, ఆదర్శ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మార్చి 20 వరకు అల్పాహారం అందించేందుకు జిల్లా విద్యాధికారి చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పదో తరగతి 13,217 మంది విద్యార్థులు చదువుతుండగా, వీరికి అల్పాహారం అందించేందుకు రూ.75,33,690 మంజూరయ్యాయి. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని 3,023 మంది విద్యార్థులకు రూ.17,23,110 కేటాయించారు. వీటిని విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణ సమయంలో అల్పాహారం అందించేందుకు విద్యాకమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి పర్యవేక్షణలో సద్వినియోగం చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు సూచించారు.

తప్పిన దాతల వెతుకులాట

పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల సమయంలో అల్పాహారం అందించేందుకు 2023లో అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తర్వాత విద్యాసంవత్సరం నిధులు మంజూరు చేయకపోవడంతో ఉపాధ్యాయులు దాతల సహాయంతో అల్పాహారం అందించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం అధికారికంగా ప్రభుత్వం అల్పాహారానికి నిధులు మంజూరు చేయడంతో ఇబ్బందులు తప్పాయి.

సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు ప్రత్యేక తరగతుల సమయంలో ఆకలి నుంచి ఉపశమనానికి అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం ధులు విడుదల చేయడం శుభపరిణామం. విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రతీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– జగన్మోహన్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి

పెండింగ్ పనులు పూర్తిచేయండి

- జీజీహెచ్‌లో పేషెంట్లకు మెరుగైన సేవలు
- తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి
- ఫిబ్రవరి 1 నుంచి స్పెషల్ డ్రైవ్
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లటౌన్: జిల్లా జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సమావేశం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నిర్వహించారు. పిడియాట్రిక్ వార్డు, పోస్టు ఆపరేటివ్ వార్డు, ఓటీ వెనుక వైపు లీకేజీలు, ఎస్‌ఎన్‌సీయూలో సీలింగ్ మరమ్మతులు, సూపరింటెండెంట్ చాంబర్ పక్కన గల గదుల్లో పైకప్పు మరమ్మతు, ఓపీ గేట్ –1 ముందు నుంచి ఎమర్జెన్సీ వార్డు వరకు గల ఖాళీ స్థలాన్ని ద్విచక్రవాహనాల పార్కింగ్, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ పనులు అడిగి తెలుసుకున్నారు. అత్యవసర రోగులను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ ఆస్పత్రికి తరలింపు కోసం అడ్వాన్స్‌డ్ లైఫ్‌సపోర్ట్ అంబులెన్స్ ఏర్పాటు అంశాలపై చర్చించారు. క్లీనింగ్, ఇతర పనులు సంబంధిత శాఖల అధికారులతో చేయించాలని సూచించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీనారాయణ, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా వైద్య అధికారి రజిత, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్‌లో నీటి ఎద్దడి రానీయొద్దు

సమ్మర్‌లో ప్రజలకు నీటి ఎద్దడి రానీయకుండా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. నీటి ఎద్దడికి టోల్‌ఫ్రీ నంబర్ 1800–599–4007 ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా తాగునీటి సరఫరాలో భాగంగా చేపట్టిన పనులు, ప్రస్తుతం నీటిసరఫరా జరుగుతున్న ఆవాసాలు, వాటర్‌సోర్స్, ఇబ్బందులు తదితర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాకు సంబంధించి ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు జరిగే స్పెషల్‌డ్రైవ్ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రానున్న వేసవిలో నీటి సరఫరా సమస్యలు ఎక్కడ ఉత్పన్నమవుతాయి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నివేదిక ముందుగానే అందించాలని సూచించారు. జిల్లాకు సంబంధించి మిడ్‌మానేర్, అప్పర్ మానేర్ నుంచి తాగునీరు వేములవాడలోని గుర్రంవానిపల్లి 120 ఎంఎల్‌డీ, గంభీరావుపేట మండలం కోలమద్ది 7 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల నుంచి 300 ఆవాసాలు(271 రూరల్, 29 అర్బన్) నీటి సరఫరా జరుగుతుందన్నారు. ప్రస్తుతం 11 ఆవాసాల్లో నీటి లీకేజీలు, రైల్వే, రోడ్డు భవనాల శాఖతో మరమ్మతు గురయ్యాయని, వీటి పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ గ్రిడ్ నుంచి ఆవాసాలకు బల్క్‌వాటర్ సప్లయ్ సక్రమంగా జరుగుతుందా.. ఇంట్రా పైప్‌లైన్ల ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందుతుందో.. లేదో.. స్పెషల్ డ్రైవ్‌లో పరిశీలించాలన్నారు. ఇన్‌చార్జి డీపీవో శేషాద్రి, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ జానకి, మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ రాము, ఎంపీడీవోలు, ఏఈలు ఎంపీవోలు పాల్గొన్నారు.

గాంధీజీకి నివాళి

సిరిసిల్లటౌన్: జాతిపిత మహాత్మా గాంధీజీ వర్ధంతి సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆధ్వర్యంలో అధికారులు నివాళి అర్పించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, కలెక్టరేట్ ఏవో రామ్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్ పనులు పరిశీలన



సిరిసిల్లక్రైం: సర్దాపూర్‌లోని 17వ బెటాలియన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, అడిషనల్ ఐజీపీ రమేశ్ గురువారం పరిశీలించారు. బెటాలియన్‌లో నిర్మాణంలో ఉన్న పోలీస్‌క్వార్టర్స్, బెల్ ఆఫ్ ఆమ్స్, కమాండ్ కంట్రోల్ బిల్డింగ్ పనులను పరిశీలించారు. అనంతరం బెటాలియన్ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఎస్పీ అఖిల్‌మహాజన్, బెటాలియన్ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాదంలో బెటాలియన్ కానిస్టేబుల్ మృతి


అజ్మీరా కళ్యాణ్ నాయక్ (ఫైల్)

వీర్నపల్లి(సిరిసిల్ల): నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లి 7వ బెటాలియన్‌లో విధులు నిర్వహించే కానిస్టేబుల్ బుధవారం రాత్రి విధులు ముగించుకొని తన గదికి వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన అజ్మీరా కళ్యాణ్‌నాయక్(29) డిచ్‌పల్లి బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిన్నాడు. విధులు ముగించుకొని బుధవారం రాత్రి తాను అద్దెకు ఉంటున్న గదికి వెళ్తుండగా డిచ్‌పల్లిలోనే ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కళ్యాణ్‌నాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని గురువారం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి కుమారుడు, కుమార్తె, భార్య సుష్మా ఉన్నారు .

పోలీసుల అదుపులో బండపల్లి యువకుడు ?

చందుర్తి(వేములవాడ): మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు గంజాయి రవాణాదారులతో సంబంధాలున్నాయన్న సమాచారం మేరకు ఇద్దరితోపాటు మరో నలుగురు పేర్లను గ్రామస్తులతో చర్చించినట్లు ప్రచారం జరుగుతోంది. గ్రామంలో ఓ యువకుడిని అదుపులోకి తీసుకోవడంతో గ్రామంలో ఎవరెవరి పేర్లు బయటకొస్తాయోనని చర్చ జరుగుతున్నట్లు సమాచారం.

రోడ్డు పనులు అడ్డుకున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని దుమాలలో రోడ్డు పనులను గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. గ్రామంలోని రామిండ్ల వాడ నుంచి అక్కపల్లికి వెళ్లే దారిలో ఒక సైడ్‌కు రోడ్డును తీస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని కాలనీ వాసులు ఆందోళనకు దిగారు. దీనిపై కలెక్టర్ చర్యలు తీసుకొని రోడ్డు నిర్మాణ పనులపై విచారణ జరపాలని కాల నీ వాసులు కోరుతున్నారు. అప్పటివరకు నిర్మాణ పనులు జరుగకుండా అడ్డుకుంటామన్నారు.

అప్రమత్తతతో సైబర్ నేరాలకు చెక్

సిరిసిల్లక్రైం: అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు చెక్ పెట్టే అవకాశం ఉందని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో గురువారం మీకోసం కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్ల మోసాలు, సైబర్ మోసాలు, మహిళా చట్టాలు, షీటీమ్, నూతన చట్టాలపై అవగాహన, సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఎవరైనా మోసపోతే 1930లో ఫిర్యాదు చేయాలని సూచించారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయొద్దని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు.

కోనరావుపేట: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మండలకేంద్రంలో గురువారం రాత్రి మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ, బ్యాంక్ ఖాతా వివరాలు అడిగితే చెప్పకూడదని, ఖాతానుంచి డబ్బులు డ్రా అయినట్లు మెసేజ్ వస్తే వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. యువకులు గంజాయి తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎస్సై ప్రశాంత్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎరువుల ‘మంద’

- నేలకు సత్తువ.. నాణ్యమైన పంట
- రైతుల చేలలో గొర్రెల మందల సందడి
- నత్రజని, కర్బనం పుష్కలం
- ఒక రోజు వెయ్యి గొర్రెల మందకు రూ.2,200


బోయినపల్లిలో గొర్రెల మంద

బోయినపల్లి(చొప్పదండి): గ్రామీణ ప్రాంతాల రైతులు గొర్రెలు, మేకల ఎరువు వాడకంపై ఆసక్తి చూపుతున్నారు. తమ పంటచేలలో రోజుల తరబడి గొర్రెల మందలు పెట్టిస్తున్నారు. గొర్రెలు, మేకలు విసర్జించే మలమూత్రాలతో భూమి సారవంతం కావడంతో పాటు నాణ్యమైన దిగుబడి వస్తుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం వరిపంట కోసి.. పత్తి ఏరిన రైతులు ఆ చేలలో మందలు పెట్టిస్తున్నారు. గొర్రె ఎరువులో సహజంగా నత్రజని, కర్బనం ఉంటాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

మందను బట్టి రేటు

గొర్రెల కాపర్లు గొర్రెలు, మేకల విక్రయంతో పాటు వాటి ఎరువును విక్రయించి అదనపు ఆదాయం పొందుతున్నారు. జనవరి నుంచి మే వరకు పంటచేలలో మందలు పెడతారు. గొర్రెలు, మేకలను పంటచేలలో ఉంచడాన్ని మంద పెట్టడం అంటారు. మందను బట్టి ధర నిర్ణయిస్తారు. 500 మేర గొర్రెలు ఉన్న మందకు రోజుకు రూ.1,000.. దాదాపు వెయ్యి గొర్రెలు, మేకలు ఉండే మందకు రూ.2,000 తీసుకుంటారు. ఎకరం చేనులో 500 గొర్రెల మంద ఆరురోజుల పాటు ఉంచుతామని పేర్కొంటున్నారు. సాయంత్రం 6 నుంచి ఉదయం 11 గంటల వరకు గొర్రెలు, మేకలు మందలో ఉంటాయి. తర్వాత వాటిని మేతకు తీసుకెళ్తారు. గొర్రె ఎరువు ఒక ట్రాక్టర్ ట్రిప్పునకు ధర రూ.2,500 ఉంటుంది.

నాణ్యమైన పంట

రైతులు పొలాల్లో విత్తనం నాటిన నుంచి పంట ఎదిగే వరకు పలుసార్లు వివిధ రకాల ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేస్తారు. అయితే గొర్రెల మంద పెట్టిన చేలలో అడుగు మందు కూడా తక్కువగా వినియోగించే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. వరికి దోమ పోటు రాదని, పత్తి దిగుబడి బాగా వస్తుందని, మంద పెట్టిన చేలలో సుమారు రెండేళ్ల పాటు సహజ ఎరువు ఉంటుందని పేర్కొంటున్నారు.

వారం రోజులుగా..



వానాకాలంలో నాలుగెకరాల్లో పత్తి పంట వేసిన. ఇటీవల పత్తి మొత్తం ఏరి కట్టె కొట్టేసినం. వచ్చే వానాకాలం సీజన్‌లో పత్తి వేసేందుకు ఇప్పుడే చేనులో గొర్రెల మంద పెట్టిస్తున్న. వారం రోజులుగా మంద చేనులోనే ఉంటోంది. గొర్రెల ఎరువుతో భూమి సారవంతం అవుతుంది.

– ఆర్.అంజయ్య, రైతు, గుండన్నపల్లి

ఐదు నెలల సీజన్



మాకు 500 గొర్రెలు ఉన్నాయి. ఏటా జనవరి నుంచి మే వరకు రైతుల చేలలో గొర్రెల మందలు పెడుతున్నం. సీజన్‌లో రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం వస్తుంది. గొర్రెల సంఖ్యను బట్టి ధర ఉంటుంది. మంద వద్ద రాత్రి పూట కాపలా ఉంటాం.

– గుంటి కొమురయ్య, గొర్రెల కాపరి, బోయినపల్లి

నాణ్యమైన దిగుబడి..



చేలలో గొర్రెల మందలు పెట్టిస్తే నేలకు సహజ పోషకాలు లభిస్తాయి. పర్యావరణం బాగుంటుంది. సేంద్రియ పద్ధతుల వలె నాణ్యమైన పంట దిగుబడి వస్తుంది. గతంలో రైతులు గొర్రె ఎరువు, ఆవు పేడ తదితర సేంద్రియ ఎరువులే వాడారు. దీంతో రోగాలబారిన పడలేదు.

– కె.ప్రణీత, వ్యవసాయ అధికారి, బోయినపల్లి

టెక్ సెంటర్‌గా కరీంనగర్

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


ఐటీ కంపెనీని ప్రారంభిస్తున్న మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్

కరీంనగర్‌కార్పొరేషన్: రానున్న రోజుల్లో సాంకేతిక కేంద్రంగా కరీంనగర్ అభివృద్ధి చెందుతుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కరీంనగర్‌తో పాటు, ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో ఐటీ, పరిశ్రమల విస్తరణకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గురువారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో నూతన సాఫ్ట్‌వేర్ కంపెనీ టెక్‌జెనీని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, కొత్త ఐటీ కంపెనీలు, పరిశ్రమలతో ఉపాధి కల్పించేందుకు తమ ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఇంజనీరింగ్ చదివినవారు ఎంతోమంది జిల్లాలో ఉన్నారని, వారికి ఐటీ కంపెనీల వల్ల ఉపాధి లభిస్తుందన్నారు. మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ, ఉపాధి అవకాశాల కోసం జిల్లా యువత ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా, కంపెనీలు తెచ్చి అభివృద్ధి చేస్తున్నామన్నారు. పరిశ్రమలు తెచ్చి ఉపాధి కల్పించేందుకు దావోస్ వెళ్లి వేల కోట్ల రూపాయల పెట్టుబడులు తెస్తే కొంతమంది విమర్శిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఆర్‌టీఏ సభ్యుడు పడాల రాహుల్, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మెండి చంద్రశేఖర్, ఆకారపు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విప్లవంలో భాగస్వాములు కావాలి

సాంకేతిక విప్లవంలో తెలంగాణవాసులు భాగస్వాములు కావాలని మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. తక్కువ పెట్టుబడితో కృత్రిమ మేధస్సు(ఏఐ)ను రూపొందించొచ్చని డీప్‌సీక్ రుజువు చేసిందన్నారు. ప్రపంచంలోనే మన దేశం, అందులో తెలంగాణలో మేధోసంపత్తి అధికమన్నారు. డీప్‌సీక్ తరహాలో ఏఐని రూపొందించేందుకు ముందుకురావాలని, వారికి ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. దావోస్ ఒప్పందాలపై విపక్షాల విమర్శలను ఆయన కొట్టిపారేశారు. గతేడాది తాము కుదుర్చుకున్న 18 ఒప్పందాల్లో 17 వివిధ స్థాయిలో ఉన్నాయని, అందులో 10 సగం పనులు పూర్తయ్యాయన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ వందశాతం విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాను పోటీచేయనని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఏఐసీసీకి చెప్పారని, రెండురోజుల్లో అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు.

వీర్నపల్లి పీహెచ్‌సీ భవనానికి భూమి పూజ

- భూమిపూజ చేసిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా


వీర్నపల్లిలో పీహెచ్‌సీ భవనానికి భూమిపూజ చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వీర్నపల్లి(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా గురువారం భూమిపూజ చేశారు. అనంతరం తాత్కాలికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలను ఓ ప్రైవేట్ భవనంలో ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రజిత, తహసీల్దార్ మారుతిరెడ్డి, ఎంపీడీవో వాజిద్, పీహెచ్‌సీ డాక్టర్ అంజుమ్ సారియా, డీడీఎం కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

మల్లాపూర్: అప్పులబాధతో మనస్తాపం చెందిన ఓ యువకుడు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సిరిపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహ్మద్ ఖలీల్ పాషా (36) నాలుగేళ్లుగా ఉపాధి కోసం అప్పు చేసి గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తున్నాడు. ఇటీవలే వచ్చిన ఆయన ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో బుధవారం గ్రామశివారులోని ఎల్లమ్మగుడి సమీపంలో పురుగుల మందు తాగి కుటుంబసభ్యులకు ఫోన్ చేశాడు. వారు అతడిని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య రేష్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య


మల్లయ్య (ఫైల్)

పెగడపల్లి: మండలంలోని దోమలకుంటకు చెందిన గీతకార్మికుడు పచ్చిమట్ల మల్లయ్య (55) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రవికిరణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గీతవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మల్లయ్య.. కుటుంబ అవసరాల నిమిత్తం తెలిసిన వారి వద్ద కొంత అప్పు చేశాడు. అప్పు చెల్లించే మార్గం లేక జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మల్లయ్య భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

దక్షిణాది రాష్ట్రాల రచయితల సదస్సుకు పెద్దింటి అశోక్‌కుమార్


అశోక్‌కుమార్

సిరిసిల్లకల్చరల్: కథా రచయిత పెద్దింటి అశోక్‌కుమార్‌కు అరుదైన ఆహ్వానం లభించింది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కవులు, రచయితలు పాల్గొనే సదస్సుకు హాజరుకావాల్సిందిగా ఆహ్వానం అందింది. ఫిబ్రవరి 3న చెన్నై వేదికగా ఈ సదస్సును సాహిత్య అకాడమీ, ఎస్సార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ నిర్వహిస్తున్నాయి. సిరిసిల్లలోని రాజీవ్‌నగర్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పెద్దింటి అశోక్ తన కథల్లో తెలంగాణ మట్టి మనుషుల జీవితాలను, ఉద్యమాన్ని కథలుగా మలిచారు.

ఇద్దరు దొంగల రిమాండ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో ఈనెల 27న దొంగతనానికి పాల్పడ్డ ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన వంగల లక్ష్మారెడ్డి తండ్రి ఇటీవల మృతిచెందాడు. దీంతో ఆ ఇంటిని విడిచిపెట్టి అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఈనెల 27వ తేదీ అర్ధరాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో దాచి ఉంచిన రూ.10వేలు ఎత్తుకెళ్లారు. మరుసటి రోజు లక్ష్మారెడ్డి ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మండలంలోని అక్కపల్లికి చెందిన సంజీవ్, పెద్దల మనోజ్ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించగా అంగీకరించారు. వారి నుంచి రూ.4వేలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


రఘు మృతదేహం

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ మూలవాగు పక్కన గల కల్లు కాంపౌండ్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. సిద్దిపేట జిల్లా కేంద్రం రాంనగర్‌కు చెందిన సారుగు రఘు(32) వంటమాస్టర్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది భార్య అమూల్యతో వ్యక్తిగత గొడవలతో ఆమె తల్లిగారి ఇంటి వద్ద ఉంటుంది. బుధవారం సాయంత్రం సిద్దిపేటకు చెందిన విక్రాంత్‌తో కలిసి వేములవాడకు వచ్చాడు. గురువారం ఉదయం కల్లు కాంపౌండ్‌లో మృతదేహం కనిపించాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని మృతుడి భార్య అమూల్యకు తెలపడంతో ఆమె వచ్చింది. మృతదేహంపై గాయాలు ఉండడంతో అనుమానాస్పద మృతిగా మృతుని భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. సంఘటన స్థలాన్ని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సీఐ వీరప్రసాద్, ఎస్సై రమేశ్ పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో అక్రమ నిర్మాణాలపై బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని బైపాస్‌రోడ్డులో గల ఓ బార్ అండ్ రెస్టారెంట్ బిల్డింగ్‌ను అక్రమంగా నిర్మించారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆరోపించారు. ఈమేరకు గురువారం సిరిసిల్ల మున్సిపల్ ఆఫీసులో ఫిర్యాదు చేసి మాట్లాడారు. సదరు బిల్డింగ్ నిర్మాణం అనుమతులపై గతంలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. బుధవారం సదరు బార్ అండ్ రెస్టారెంట్‌కు ఇచ్చిన అనుమతి ప్రకారం లేని నిర్మాణాలను తొలగించిన తర్వాతే నిర్వహణకు అనుమతులు ఇవ్వాలని కోరారు. భవన యజమానిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జ్యోతినగర్ నుంచి డంప్‌యార్డు వరకు సిరిసిల్ల గ్రామపంచాయతీ కాలం నుంచి ఉన్న రోడ్డును తిరిగి వినియోగంలోకి తేవాలని విన్నవించారు. ఈరోడ్డును ఆక్రమించి వెలసిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని కోరారు.


గుడి చెరువు ఖాళీ స్థలం చదును చేస్తున్న ట్రాక్టర్

జాతర కోసం..

వేములవాడ: రాజన్న ఆలయంలో ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఇప్పటి నుంచే పనులు మొదలుపెట్టారు. ఇప్పటికే ఆలయాలకు రంగులు వేస్తున్నారు. గురువారం క్యూలైన్లలో ఫ్యాన్లు, లైట్లు సవరించారు. ఇప్పటికే వినియోగంలో ఉన్న సీసీ కెమెరాలను శుభ్రం చేసి రిపేర్లు చేస్తున్నారు. భక్తులు విడిది చేసేందుకు గుడి చెరువు పార్కింగ్ స్థలం చదును చేస్తున్నారు.


క్యూలైన్‌లోని ఫ్యాన్‌లు సరిచేస్తున్న సిబ్బంది


సీసీ కెమెరాలు బిగిస్తున్న సిబ్బంది

ఇద్దరికి జైలు

వేములవాడ: పోలీసుల విధులకు ఆటంకం కల్గించిన ఇద్దరికి ఆరు నెలల జైలుశిక్షతోపాటు తలా రూ.వెయ్యి జరిమానా విధిస్తూ వేములవాడ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి గురువారం తీర్పు వెల్లడించినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. నాగయ్యపల్లికి చెందిన రొండి శంకరయ్య, పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన గుర్రం అశోక్‌లు అక్టోబర్ 14, 2017న ఓ కేసు దర్యాప్తు చేస్తుండగా ఎస్సై చిట్టిబాబు విధులకు ఆటంకం కల్గించినట్లు పేర్కొన్నారు. విచారణ అధికారి శ్రీనివాస్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు కానిస్టేబుల్ సురేష్ సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ విక్రాంత్ కేసు వాదించారు. పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరస్తులకు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు చెప్పారు.

రూ.కోటి దాటిన కొండగట్టు అంజన్న ఆదాయం


హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కొండగట్టు(చొప్పదండి) కొండగట్టు అంజన్న ఆలయానికి భక్తుల ద్వారా వచ్చిన ఆదాయం రూ.కోటి దాటింది. ఆలయంలోని హుండీల ఆదాయాన్ని గురువారం అధికారులు లెక్కింపు చేపట్టారు.70రోజులకుగాను 12 హుండీలను లెక్కించగా రూ.1,15,93,291 నగదు, 55 గ్రాముల మిశ్రమ బంగారం, మూడు కిలోల మిశ్రమ వెండి, 61 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ అంజయ్య, సూపరింటెండెంట్ సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్ పాల్గొన్నారు.

గుడుంబా అమ్మితే జైలుకే..

- పూచీకత్తును ఉల్లంఘిస్తే జరిమానా, జైలు
- రెండేళ్లలో రూ.15.86లక్షల జరిమానాలు చెల్లింపు
- బైండోవర్లను తేలిగ్గా తీసుకుంటే కటకటాల్లోకే..
- జిల్లాలో 2021 మంది బైండోవర్
- అయినా ఆగని గుడుంబా విక్రయాలు
- నేరస్తులపై ప్రత్యేక నిఘా
- తాజాగా రూ.లక్ష పూచీకత్తుపై 10మంది బైండోవర్


ఈ చిత్రంలో కనిపిస్తున్న వారంతా నాటు సారా తయారుచేసి విక్రయిస్తూ అధికారులకు పట్టుబడ్డారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని వివిధ తండాలకు చెందిన 10 మందిని రూ.లక్ష సొంత పూచీకత్తుపై గత సోమవారం ఎక్సైజ్ అధికారులు ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఎన్నిసార్లు పోలీసులకు పట్టుబడ్డ గిరిజనులు మాత్రం సారా తయారీని విడిచిపెట్టడం లేదు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గిరిజనులు ప్రత్యామ్నాయ ఉపాధిగా ఎంచుకున్న గుడుంబా తయారీ.. వారిని జైలుపాలు చేస్తుంది. అక్షర జ్ఞానం.. అవగాహన లేకపోవడంతో గుడుంబా విక్రయిస్తూ కటకటాల పాలవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గుడుంబా విక్రయాలపై ఉక్కుపాదం మోపుతుండడంతో ఇటీవల జైలుకు వెళ్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. బైండోవర్ నిబంధనలు తెలియక కొందరు పదే..పదే అదే తప్పు చేస్తూ జైలుపాలవుతున్నారు.

పెరిగిన బైండోవర్‌లు

ఐదు రోజుల వ్యవధిలో ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 10 మందిని బైండోవర్ చేయడంతోపాటు ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో రెండేళ్లలో 2,021 మంది నాటుసారా తయారీ, విక్రయదార్లను ఎక్సైజ్ అధికారులు బైండోవర్ చేశారు. బైండోవర్ సమయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.లక్ష పూచీకత్తు లేక జైలు శిక్ష అనే షరతులు విధించి వదిలేస్తారు. ఈ షరతులను ఉల్లంఘించిన ఐదుగురికి జైలు శిక్ష విధించగా జైలుకు వెళ్లకుండా జరిమానాలు చెల్లించి బయటకొచ్చారు. తాజాగా ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి చెందిన ఇద్దరు బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించగా.. ఓ మహిళ రూ.లక్ష జరిమానా చెల్లించి బయటకొచ్చింది. మరొకరు జైలుకు వెళ్లారు. ఇలా నాటు సారా దందా చేస్తూ పట్టుబడ్డ చాలా మంది నుంచి ఎక్సైజ్ అధికారులు జరిమానాలు వసూలు చేస్తున్నా దందాకు మాత్రం బ్రేక్ పడడం లేదు.

బైండోవర్ల వివరాలు

ఎక్సైజ్ స్టేషన్	బైండోవర్లు	ఉల్లంఘనలు	జరిమానాలు
సిరిసిల్ల	525	01	రూ.25వేలు
ఎల్లారెడ్డిపేట	1,070	41	రూ.13.86లక్షలు
వేములవాడ	430	07	రూ.1.75లక్షలు

నిబంధనలు కఠినతరం

జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, వేములవాడ, కోనరావుపేట, ముస్తాబాద్, గంభీరావుపేట, చందుర్తి, రుద్రంగి మండలాల్లో గుడుంబా విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. ఆయా మండలాల్లో ఎక్సైజ్ అధికారులు పెద్ద ఎత్తున బైండోవర్లు చేస్తున్నారు. మొదటి రెండు తప్పులతో బైండోవర్ అయిన వారు తిరిగి సారా, గంజాయి విక్రయించడం లాంటి సంఘటనల్లో పట్టుబడితే ఏడాది జైలు లేక రూ.లక్ష జరిమానా విధిస్తున్నారు. జిల్లాలోని 8 మండలాల్లో 2025 మందిని బైండోవర్ చేశారు. ఇందులో ఐదుగురు తిరిగి నేరాలకు పాల్పడడంతో జైలుశిక్ష, జరిమానా విధించారు. గతంలో ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి చెందిన ఓ మహిళతోపాటు ఓ గిరిజనుడు బైండోవర్ తర్వాత గుడుంబా అమ్ముతూ పట్టుబడగా వారిద్దిరికీ జైలుశిక్ష విధించారు. మహిళా మాత్రం రూ.లక్ష జరిమానా చెల్లించి జైలు నుంచి విడుదలైంది.

అందని ప్రభుత్వ సాయం

జిల్లాలో నాటుసారా, గుడుంబా తయారీ, విక్రయాలను అరికట్టేందుకు ప్రభుత్వం గత 2016 అక్టోబర్‌లో పునరావాస ప్యాకేజీని ప్రకటించింది. ప్రభుత్వం ముందుచూపుగా రాష్ట్రాన్ని గుడుంబా రహితంగా మార్చాలనే సంకల్పంతో పునరావాసం పథకం ప్రవేశపెట్టగా కాలక్రమంలో అది అమలుకు నోచుకోవడం లేదు. మొదటి విడతగా జిల్లాలో 56 మందికి ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున రుణం అందజేసింది. అప్పటి వరకు గంజాయి అమ్మిన వారు ప్రభుత్వం అందించిన సాయంతో కిరాణం, టెంట్‌హౌస్‌లు, డైయిరీ లాంటివి ఏర్పాటు చేసుకుని వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ పథకం నిలిచిపోవడంతో మళ్లీ అనేక మంది సారా తయారీ, అమ్మకాలపై దృష్టి సారించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరావాస పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.

ఉపాధి కల్పించాలి..



ప్రభుత్వం నిరుపేద గిరిజనులకు ఉపాధి కల్పించాలి. చేతినిండా పని ఉంటే గుడుంబా జోలికి వెళ్లే అవసరం ఉండదు. సారా కేసుల్లో పట్టుకున్న వారిని బైండోవర్ చేస్తూ మళ్లీ దొరికితే జైలుకు పంపుతున్నారు. పూట గడవడమే కష్టంగా ఉన్న వారు రూ.లక్ష జరిమానా చెల్లించలేక ఏడాది జైలుశిక్ష అనుభవిస్తున్నారు. దీంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. – భూక్య ఈరవ్వ, రాజన్నపేట

బైండోవర్లను ఆషామాషీగా తీసుకోవద్దు

జిల్లాలో చాలా మంది గుడుంబా అమ్మకం, తయారీదారులను బైండోవర్లు చేస్తున్నాం. బైండోవర్లను కొంతమంది ఆషామాషీగా తీసుకుంటున్నారు. ఇలా అనేక మంది జైలుకు వెళ్లడం, జరిమానాలు కట్టడం జరుగుతోంది. తహసీల్దార్ల ముందు బైండోవర్లను సీరియస్‌గా తీసుకోవాలి. గుడుంబా నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ, ఎల్లారెడ్డిపేట